క్లుప్తంగా

జూన్ నాటికి ఆస్పత్రి భవనం పూర్తి



పనులు పర్యవేక్షిస్తున్న డీఈ రామినాయుడు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురంలో శరవేగంగా జరుగుతున్న ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవన నిర్మాణ పనులు జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని ఆర్అండ్బీ డీఈ సాసుమాన రామినాయుడు తెలియజేశారు. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. రూ.2.38 కోట్లతో జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

'సాగునీటికి చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న గోవిందరావు

టెక్కలి: శివారు ప్రాంతాలకు సాగునీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. వంశధార కాలువకు ఉన్నటువంటి షటర్లను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. షటర్లు ప్రస్తుతం మరమ్మతులకు గురవ్వడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



తాగునీటి సరఫరా ప్రారంభిస్తున్న శిష్టు గోపి తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఎక్కడ వచ్చినా, తక్షణ చర్యలు చేపడతామని పట్టణ వైఎస్సార్సీపీ పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి అన్నారు. మున్సిపాలిటీ పరిధి 19వ వార్డు సచివాలయం పరిధిలో అధికంగా ఉన్నటువంటి జీడి కార్మికులు ఉన్న సూదికొండ ప్రాంతంలో మున్సిపల్ తాగునీటి ట్యాంకర్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండ ప్రాంతంలో తాగునీటితో ఇబ్బందులు పడుతున్న వారు మున్సిపాలిటీ తాగునీటి సరఫరా విభాగాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

టెక్కలి: ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో విద్యార్థినులను అభినందించారు. కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న వర్జాన శ్రావణి, గౌడ గౌతమి తదితర విద్యార్థులు జిల్లా తరపున పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో కళాశాల పీడీ బి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ల్యూక్ పాల్, అధ్యాపకులు ఎం.బాలకృష్ణ తదితరులు విద్యార్థులను అభినందించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: గ్రామాభివృద్ధే తన ధ్యేయమని తలతంపర పంచాయతీ సర్పంచ్ జగబంధు దొళాయి అన్నారు. పంచాయతీలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా రెండేళ్లలో గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి పనులు వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బృందావన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



మందస: విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

టెక్కలి: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన టెక్కలి మండలం సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్.వేణికుమారి మాట్లాడుతూ.. పాఠశాల నుంచి 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, వారిలో 94 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి.మల్లమ్మ, ఎంపీటీసీ బి.దేవయాని తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి రూరల్: అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో ఉపాధ్యాయులు ఆయా విద్యార్థుల ఇళ్ల వద్దకు సోమవారం వెళ్లి అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మందస: మండలంలోని లొహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించారు. దీంతో హెచ్ఎం వై.అరుణశ్రీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా కలిసి విద్యార్థుల ఇళ్ల వద్దకు సోమవారం వెళ్లి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ అందాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని ఎం.ఎస్ పల్లి ఆదర్శ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్, ప్రిన్సిపాల్ శివప్రసాద్‌లు అభినందించారు. వారితో పాటు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, సర్పంచ్ గొనప సింహాచలం, పార్టీ నాయకులు గేదెల బాలయ్యరెడ్డి, పైల త్రినాథ్ రెడ్డి, పైల భీమారావు, గేదెల రాజు తదితరులు ఉన్నారు.

టెక్కలి రూరల్: నందిగాం మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు హెచ్ఎం చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 97.05 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.ధర్మారావు, ఉపాధ్యాయులు బి.రత్నం, దుంపా శ్రీనివాస్, తులసి ప్రసాద్, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు



పలాస: విద్యార్థినికి స్వీట్ తినిస్తున్న ఉపాధ్యాయులు



టెక్కలి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిధుల కేటాయింపు ప్రశంసనీయం



షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న దృశ్యం

కవిటి: గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా సుస్థిరాభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపులు ప్రశంసనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగలో 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌తో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ గదులను అద్దెకు ఇవ్వడం ద్వారా పంచాయతీకి ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని సర్పంచ్ ఎస్వీ నారాయణస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రకాష్, ఎన్.బాబూరావు, దేవరాజ్ సాహూ, పి.నేతాజీ, కె.గోపయ్య, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈత కల్లు దుకాణం తొలగింపు

మందస: పట్టణంలోని రాజావారి చెరువు గట్టుపై ఉన్న ఈతకల్లు దుకాణాన్ని సోమవారం అధికారులు తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో దుకాణం ఉండడంతో ఇటీవల స్థానికులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకురావడంతో, దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. కల్లు దుకాణంతో ఇబ్బందులున్నాయని, కొంతమేర ప్రభుత్వ స్థలం కూడా ఆక్రమణకు గురైందని అధికారుల దర్యాప్తులో తేలింది. దీంతో తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, సర్వేయర్ కె.మోహనరావు, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, సీఐ శంకరరావు, ఏఎస్ఐ శేఖరరావు, పోలీసులు ఈతకల్లు, ఆక్రమణ తొలగింపునకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈతకల్లు దుకాణం యజమాని కె.నాగేశ్వరరావుతో అధికారులకు స్వల్ప వాగ్వాదం జరిగింది. తమ విధులను సక్రమంగా చేసుకోనివ్వాలని అధికారులు చెప్పడంతో, స్వచ్ఛందంగా నాగేశ్వరరావు పాకను తొలగించడానికి ముందుకు వచ్చారు. అనంతరం అధికారులు జేసీబీతో ఆక్రమణ స్థలానికి చదును చేసేశారు. నాగేశ్వరరావుకు గల పట్టా స్థలాన్ని విడిచి పెట్టి, కాలువను కూడా బాగు చేస్తామని అధికారులు చెప్పారు.

టీడీపీ నాయకుల హడావుడి

చెరువుపై ఆక్రమణల తొలగింపు అనంతరం అధికారులు, పోలీసులు ఎండోమెంట్ ఆఫీస్ వద్ద కనిపించారు. దీంతో అక్కడ ఆక్రమణలుగా భావిస్తున్న దుకాణాలను తొలగిస్తారనే భయంతో టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఇప్పటికే ఈ వివాదం కోర్టులో ఉందని అధికారులు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వజ్జ బాబురావుతో పాటు మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రి 8.30 గంటలకు అధికారులు వెళ్లిపోయారు. అయినా సంఘటన స్థలంలోనే ఉన్న టీడీపీ నాయకులు రాత్రి 9.45 గంటల సమయంలో నిష్క్రమించారు.



ఈతకల్లు పాకను తొలగిస్తున్న అధికారులు

పక్కాగా పొదుపు సంఘాల సమాచారం



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

మందస: పొదుపు సంఘాల సమాచారం ఇకపై పక్కాగా ఉంటుందని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో లోకోస్ యాప్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోకోస్ యాప్‌లో మహిళా సంఘాలకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరచడం జరుగుతుందన్నారు. గ్రూపుల పొదుపు, అప్పులు, బ్యాంక్ ఖాతాల వివరాలు, ఆధార్ అనుసంధానం, ఫోన్ నంబర్, ఈకేవైసీ తదితర సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో వీవోఏ, సీసీలు ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు సవర కాంతమ్మ, కోశాధికారి బాలక విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మందస: అవగాహన కల్పిస్తున్న ఏపీఎం ప్రసాదరావు

కొత్త సంఘాల ఏర్పాటుపై దృష్టి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో నూతన స్వయం శక్తి సంఘాల ఏర్పాటుపై వీవోఏలు దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు సూచించారు. బలరాంపురం గ్రామంలో వీవోఏలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రైతుల చేత రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీసీ మోహనరావు, గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మండలానికి సర్వే రాళ్లు



మండలానికి చేరిన సర్వేరాళ్లు

కోటబొమ్మాళి: మండలంలో జగనన్న శాశ్వత భూహక్కు సర్వే పూర్తయిన 12 సచివాలయాల పరిధిలో హద్దులు నిర్ణయించేందుకు ప్రభుత్వం నుంచి మండలానికి సర్వేరాళ్లు వచ్చాయని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ సోమవారం తెలియజేశారు. ఈ మేరకు సర్వే పూర్తయిన అన్ని గ్రామాల్లో సర్వేయర్లు, వీఆర్వోల ఆధ్వర్యంలో సర్వేరాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మాశాఖపురం గ్రామానికి చెందిన అంబటి మాదయ్య కొంతకాలంగా పచ్చ కామెర్లుతో బాధపడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో అదే గ్రామానికి చెందిన యువకులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని రోగి కుటుంబానికి సోమవారం అందజేశారు. అలాగే పవన్ సేన సంస్థ నుంచి రూ.4 వేల సాయం అందించారు. కార్యక్రమంలో తిప్పన దుర్యోధన రెడ్డి, బాలరాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబును ముస్లింలు నమ్మరు'

కోటబొమ్మాళి: అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి మేలు చేయని చంద్రబాబును ముస్లింలు నమ్మే పరిస్థితి లేదని మండల కో-ఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజూబాయ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మేలు చేస్తామంటూ ఆయన ఇటీవల ప్రగల్భాలు పలుకుతూ, మరోవైపు బీజేపీతో స్నేహం చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారని మండిపడ్డారు. ముస్లింలను అన్నివిధాలుగా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించేందుకు ముస్లింలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు.

చిన్నారులను పనిలో పెట్టుకోవడం నేరం

సోంపేట: చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని సోంపేట సహాయ కార్మికాధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలో టౌన్ హాల్ వీధిలోని ఒక సెలూన్‌లో విధులు నిర్వహిస్తున్న 14 సంవత్సరాల్లోపు బాలుడిని సోమవారం గుర్తించి, యజమానికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కేసు నమోదు చేశారు. బాల కార్మికులను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, సర్పంచ్ మామిడి సింహాద్రి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: ప్రజా సంక్షేమమే వైఎస్సార్సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సచివాలయ పరిధిలో ప్రతి గడపకూ వెళ్లి ఆయా కుటుంబాలకు గత నాలుగేళ్లలో జరిగిన మేలును తెలియజేశారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తుండడంతో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలియజేశారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పొడుగు కామేష్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 18 వినతులు

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 18 వినతులు వచ్చాయి. టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పి.తులసమ్మతో పాటు మరి కొంతమంది కోరారు. మండలంలోని గూడేం, డమర, కిట్టాలపాడు, రాంపురం తదితర గ్రామాల్లో రాధాకాంత మఠం భూములు సాగు చేస్తున్న రైతులు, తమకు రైతు భరోసా వచ్చే విధంగా చూడాలని విన్నవించారు. టెక్కలి శివారు ప్రాంతంలోని మదనగోపాల సాగరాన్ని ఆనుకొని ఉన్న బోదె కాలువ ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరారు.

అలాగే మండలంలోని తిర్లంగి గ్రామం చెరువు మీద ఉన్న రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలని, వంశధార 46ఎల్ఆర్ కాలువపై ఆక్రమణలు తొలగించాలని, సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించాలని రైతులు విన్నవించారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. స్పందనకు వచ్చిన వినతుల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

'పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి'

టెక్కలి రూరల్: వివిధ ప్రభుత్వ శాఖల్లో డ్రాయింగ్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నవారు తమ శాఖల్లో విధులు నిర్వహిస్తూ అభియోగాలు మోపబడినవారు, వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నవారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని టెక్కలి ఉప ఖజానాశాఖాధికారి బి.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో డీడీవోల అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రాయింగ్ అధికారుల పరిధిలోని పలువురు అధికారుల అవినీతి ఆరోపణలు, విధుల దుర్వినియోగం తదితర ఆరోపణలను ఈనెల 15వ తేదీలోగా నమోదు చేయాలని సూచించారు. వివరాలు తప్పుగా నమోదు చేసినవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సంబంధిత ఉద్యోగుల వివరాలు ఏవిధంగా నమోదు చేయాలనే విషయాన్ని ఉపఖజానాధికారి ఎం.భాగ్యలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ ట్రెజరీ పరిధిలో ఉన్న టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల వివిధ శాఖల డీడీవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

సంక్షిప్తంగా..

సచివాలయాల పరిశీలన

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు సచివాలయాలను సోమవారం రాత్రి జిల్లా ప్రత్యేకాధికారి సిద్ధార్థ జైన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. టెక్కలిలో ఉన్న రెండు, మూడు, ఐదు సచివాలయాల్లో తనిఖీ చేస్తూ సంక్షేమ పథకాల వివరాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ, గ్రామ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, ఎంపీడీవో జి.ఉమాసుందరి, పంచాయతీ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం

కంచిలి: మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పిలి కృష్ణారావు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

మజ్జి గౌరమ్మ ఆలయ ప్రతిష్ట నేడు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌కు ఆనుకొని ఉన్నటువంటి నర్సిపురం గ్రామంలో మజ్జిగౌరమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 11వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రసవత్తరంగా బల ప్రదర్శన పోటీలు

టెక్కలి: టెక్కలి ఆదిఆంధ్రా వీధిలో జరుగుతున్న మూగమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా జరిగాయి. తీతరాయి పోటీల్లో ఒప్పంగి గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ మొదటి స్థానం, రమణ ద్వితీయ స్థానం, ఆవాలా వసంతరావు తృతీయ స్థానం సాధించారు. ఈడుపు రాయి పోటీల్లో జి.సత్యనారాయణ, ఆవాల వసంతరావు, ఆవాల త్రినాథరావు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జోగి కుమార్, జోగి డిల్లేశ్వరరావు, జె.రవి, జె.జనార్ధనరావు, జె.హేమసుందర్, జె.రమేష్, జె.నాగరాజు, జె.నాని, జె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కంచిలి: మండలంలోని కత్తివరం గ్రామానికి చెందిన చెరుకుపల్లి నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో వారి కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయనతో వైఎస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పీఏసీఎస్ అధ్యక్షుడు దుర్గాసి ధర్మారావు, ఎంపీటీసీ పొందూరు ముఖలింగం, కోరాడ దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ విద్య

కవిటి: ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ విద్య అందుతోందని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజేశ్వరరావు అన్నారు. జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఇచ్ఛాపురం, కవిటి మండలాల పరిధిలోని సన్యాసిపుట్టుగ, తిప్పనపుట్టుగ, శీమూరు, బూర్జిపాడు తదితర గ్రామాల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం క్యాంపెయినింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోలాకి హరి, జిణగ పాపారావు, గొండ్యాల విష్ణుమూర్తి, బొడ్డ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

భావనపాడులో రక్తదాన శిబిరం

సంతబొమ్మాళి: మండలంలోని భావనపాడులో ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా ఆ నలుగురు సేవా సంఘం ఆధ్వర్యంలో పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం, ఉచిత రక్త పరీక్షలు సోమవారం నిర్వహించారు. శిబరంలో 42 మంది రక్తదానం చేశారు. ప్రతీ గ్రామంలో యువత ఇలాగే రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డాక్టర్ జుత్తు చిన్ని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవా సంస్థ సభ్యులు పి.పాపారావు, ఎస్.ఈశ్వరరావు, టెంకతేజ, రామకృష్ణ సేవా సమితి సభ్యులు మురళీకృష్ణ, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకోవాలి'

టెక్కలి: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల కోసం సుమారు 35 రోజుల పాటు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.రామారావుపాల్గొన్నారు.

కంచిలి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి సూచించారు. మండలంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వజ్జ మృత్యుంజయం, ఇప్పిలి కృష్ణారావు, కొత్తకోట శేఖర్, రాందాస్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని సంతబొమ్మాళి, నౌపడ శాఖా గ్రంథాలయాల్లో ఎంఈవో జలుమూరు చిన్నవాడు, స్థానిక సర్పంచ్ పిలక బృందాదేవి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసర ప్రాంతాల విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్.జయకృష్ణారెడ్డి, సర్పంచ్ కె.లక్ష్మి, శాఖ గ్రంథాలయాధికారి రామకృష్ణ, బి.రూపావతి తదితరులు పాల్గొన్నారు.